# అపోహాగానం

నా చిన్నప్పుడు ఒక వారపత్రికలో "ఊహాగానం" అని ఒక శీరిక వస్తుం డేది. లతగారు వ్రాశేవారని గుర్తు. అది ఊహాగానం అయితే, ఇది అపోహాగానం అంటే మన జీవన సంగీతంలో అపోహాల గానాలెలా వుంటాయి అని.

ఊహాలకే కన్నులుంటే అని ఒక పాటలో వస్తుంది. అదొక ఆశావాదం. ఆ కళ్ళకి మసక కమ్మితే ఊహలు అపోహలవుతాయి.ఇది నిత్యజీవితంలో మనం చూసే అపార్థాల అనర్థం

కొన్నేళ్ళ క్రితం ఒక సెమినార్‌కి వెళ్ళాను. అది "పర్సెప్షన్ వర్సెస్ రియా లిటీ" గురించి అంటే ఇది ఇలాటిది అనుకోవటానికీ, ఇది నిజంగా ఇది అని తెలుసు కోవటానికీ వున్న తేడా, అని తెలుగులోకి తర్జుమా చెసుకోవచ్చు. ఇలాటిది అను కున్నదీ నిజంగా అయినదీ, ఒకటే అయినప్పుడు ఇబ్బంది లేదు. అవి పరస్పర విరుద్ధం అయినప్పుడు మనలో ఈ అపోహలు ఎంతగా పాతుకుపోయాయో చూపించి కళ్ళు తెరిపిస్తాయి. ఆ సెమినార్‌కి కావాలనే, రకరకాల వ్యక్తులి - తెల్ల వాళ్ళనీ, నల్లవాళ్ళనీ, కొంతమంది ఇతర దేశాలవారినీ, ఆడవాళ్ళనీ, మగవాళ్ళనీ అందరినీ పిలిచారు. ఈ సెమినార్‌లో ఇన్‌స్ట్రక్టర్ బోర్డుమీద ఏదో ఒకమాట వ్రాయ టమో, లేదా ఒక ఫొటో చూపించటమో చేస్తారు. మనకి సరిగ్గా పది సెకండ్ల టైమ్ ఇస్తారు. ఆ పది సెకండ్లలో మనం అది చూసి, ఏమనుకుంటున్నామో ఒక చిన్న స్టిక్కర్‌మీద వ్రాయాలి. ఆలోచనకి సమయంవుండదు కనుక, అది మన మనసులోని మాట అయే అవకాశం ఎక్కువ. దాని మీద మన పేరు వ్రాయకూడదు. అంటే మన జవాబులు గుప్తంగా వుంచుతారన్నమాట. అలా ఇరవై మాటలో, ఫొటోలో చూసి, మన మనసులో చటుక్కున ఏ భావం వస్తుందో అది వ్రాస్తాం అలా అందరూ వ్రాసి న సమాధానాలని ఒక్కొక్క ప్రశ్నపక్కన వుంచుతారు. ఇప్పుడే మొద లవుతుంది అసలు కథ.

ఆరోజు సెమినార్ సీరియస్‌గా ఎన్నో విషయాలమీద జరిగితే ఈ వ్యాసం లో ఒకటి రెండు విషయాలు మాత్రమే ఉదాహరణలుగా చూద్దాం అవేమిటో. ఒక నల్లతని ఫొటో చూపించినప్పుడు జవాబులిలా వున్నాయి. బాస్కెట్ బాల్ బాగా ఆడతాడు, మంచి గాయకుడు, జాజ్ మ్యుజీషియన్, మంచి డాన్సర్, పెద్ద దొంగ, హంతకుడు, బానిసలాటివి. ఈ జవాబుల్లో వ్రాసినవారి ఉద్దేశ్యంలో నల్లవారి మీద అభిప్రాయాలు భావాలు కనిపిస్తాయి. కొన్ని కొంతవరకే నిజం కావచ్చు కొన్ని అస లు నిజమే కాకపోవచ్చు. కానీ వారిగురించి మనుష్యుల మనసుల్లో ఏముందో తెలు స్తుంది. వారి ఊహల గురించీ, అపోహల గురించీ తెలుస్తుంది. అలాగే చైనీస్ అతని ఫొటో చూపించినప్పుడూ, ఒకావిడ ఫొటో చూపించినప్పుడూ, రకరకాల జవా

బులు. ప్రతి ప్రశ్నకీ ఇచ్చిన జవాబులన్నీ వ్రాసి, లెఖ్ఖలు వేసి బోర్డుమీద వ్రాస్తారు. దాని పక్కనే ముందే సేకరించిన నిజమైన నెంబర్లు వేస్తారు. అమెరికన్ జనాభాలో ఆ విషయాలలో వీరి శాతం ఎంత అని చూపిస్తారు. మన అపోహలు ఒక్కసారిగా తేటతెల్లమవుతాయి. ఉదాహరణకి నల్లవారికన్నా కూడా ఎక్కువగా నేరాలు చేసేది అమెరికన్ తెల్లవాళ్ళు, కొంతమంది ఇతర దేశీయులు అని చెప్పే స్టాటిస్టిక్స్ చూస్తే మన అపోహలర్ధమవుతాయి. ఈమధ్య 13 సంవత్సరాల వయసు అమ్మాయిలతో సెక్స్ సంబంధాలకోసంవెళ్ళి పట్టుబడ్డ 16మందిలో నలుగురు ఇండియన్స్. అందులో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారంటే మీకు కాదు మాకూ ఆశ్చర్యం వేసింది.

అపోహలు ఒక రంగానికీ ఒక జాతికీ మాత్రమే కాదు, మనుష్యులందరిలో, అన్ని రంగాల్లోనూ వున్నాయి. వాటికి కారణాలేమైనా కావచ్చు. వారి జాతి, కులం, మతం కాని వారి మీద వున్న దురభిమానం కావచ్చు. మంచి పుస్తకాలూ, స్టాటిస్టిక్స్‌తో సంబంధం లేకుండా, ఏవో గాసిప్ పత్రికలూ, చెత్త సినిమాలూ, టీవీ ప్రోగ్రాములద్వారా చూసిన సమాచారంకావచ్చు. ఇంకొకరి మీద వున్న అసూయా ద్వేషాలు కావచ్చు. కొన్ని సందర్భాల్లో ఇవి అపోహలయితే, కొన్ని సందర్భాల్లో అదొక వ్యక్తిగతమైన అజెండా కావచ్చు. అన్నిటికన్నా కూడా ప్రమాదకరమైంది, పైకి చెప్పే అభిప్రాయం ఒకటీ, చేసే పని ఇంకొకటీ అవటం. దానికి మనకో సామెత కూడా వుంది చెప్పేవి శ్రీరంగనీతులూ దూరేది.. అని. ఇది అపోహ సంబంధంకాదు. ద్వంద నీతి. మళ్ళీ అపోహలగురించి చూద్దాం. మనం ఏ ఆధారాలూ లేకుండా లేదా ఏదో ఒకటో రెండో ఆధారాలతో, ఒక మార్చుకోలేని అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవటం మంచిదికాదు. మనకి క్షణ్ణంగా పరిశీలించే సమయం లేదా సత్తా లేనప్పుడు ఆ అభిప్రాయాన్ని అంత నిర్దుష్టంగా ఏర్పరుచుకోవాల్సిన అవసరంకూడా లేదు. ఎందుకంటే ఈ అభిప్రాయాలు సమయానుకూలంగా మారుతుంటాయి కనుక.

ఒక్కోసారి, మీరు ఏ కోణంలో చూస్తున్నారు అన్నదాన్ని బట్టి కూడా వుంటుంది. ఉదాహరణకి ఒక పాలస్తీన్ వ్యక్తి అతను చేసే మారణహోమంవల్ల అరబ్ దృష్టిలో, నిస్వార్ధంగా తను నమ్మిన సిద్ధాంతాలకి బలి అవుతున్న హీరో అవుతాడు. అదే వ్యక్తి ఇజ్రాయిల్‌కి టెర్రరిస్ట్ అవుతాడు. అలాగే పాకిస్థాన్ "జిహాద్" టెర్రరిస్టులు ఆ దేశం వాళ్ళకి దేశభక్తులు. అమెరికా సోవియట్ యూనియన్ బద్ధ విరోధులుగా వున్నప్పుడు రష్యాతో చేరిన అన్ని దేశాలనీ ఇండియాతో సహా, అమెరికా శతృవర్గం క్రిందనే లెఖ్ఖ వేసింది.

అలాగే మనకి ఒక పరిస్థితిలో నచ్చనివాళ్ళు, వేరే ఇంకొక పరిస్థితిలో నచ్చే అవకాశంవుంది. ఉదాహరణకి, ఇండియా శ్రీలంకతో క్రికెట్ మేచ్ ఆడుతున్నప్పుడు మనందరికీ సహజంగా ఇండియా గెలవాలని వుంటుంది. శ్రీలంక ఇంగ్లాండ్‌తో ఆడుతున్నప్పుడు మాత్రం నాకు శ్రీలంక గెలవటమే ఇష్టం. కానీ ఇంగ్లాండ్ పాకిస్థాన్‌తో ఆడుతున్నప్పుడు ఇంగ్లాండ్ గెలిస్తే బాగుంటుందనిపిస్తుంది. అలా మన లాయల్టీలు కూడా పరిస్థితులని బట్టి మారుతుంటాయి.

మనం ఒక అనుభవాన్నో ఒక ఆధారాన్నో చూసి, అన్ని విషయాల్లోనూ

వాళ్ళు అంటే అనుకోవటం ఇంకొక రకం భ్రమ. ఇది చాల ప్రమాదకరమైన భ్రమ.

రావణాసురుడు రాముడి చేతిలో దెబ్బతిని పడిపోయి చివరిక్షణాల్లో వున్నప్పుడు, రావణుడు తనకి శత్రువైనాకూడా రాజనీతిలో చాల గొప్పవాడు కనుక, రాముడు రావణుడి దగ్గర రాజనీతి సూత్రాలు తెలుసుకున్నాడు.

ఏ స్పెల్లింగ్ బీ, మాథ్లటిక్స్ పోటీల్లోనో మన ఇండియన్ పిల్లలు గెలవటం చూసి, అమెరికన్లకి అసలు చదువేరాదనీ మనవాళ్ళతోనే అమెరికా నడుస్తున్నదనీ అంటాడు మా వెంకట్రావ్. అమెరికాలో వున్న 260 మిలియన్ల జనాభాలో ఇండియా, పాకిస్థాన్ మొదలైన దేశాల వాళ్ళందర్నీ కలిపినా ఒక మిలియన్‌కన్నా ఎక్కువ లేరని చెబుతున్నారు సెన్సరులు. మనమెవ్వరమూ రాక ముందునించే, అమెరికాలో చదువుకున్న వారి సంఖ్య ప్రపంచంలో చాల ముందున్నది. ఆ చదువూ, తెలివితేటలూ, కష్టపడి పని చేసే సుగుణం, అధిక ఉత్పత్తి అమెరికా ఆర్థికంగా ఎంతో ముందుకు పోవటానికి సహాయపడింది. అలాగే అమెరికా రాజకీయాలు అమెరికాకి మంచివే మిగతా దేశాలకి కాకపోవచ్చు. అమెరికా రాజకీయ విధానాలు నచ్చకపోతే, ప్రతి ఏటా ఇతర దేశాలనించీ, అమెరికాకి ఎందుకు అంత ఎక్కువగా జనం వలస వస్తున్నారన్నది ఒక ప్రశ్న'

ఇందాక మనం క్రికెట్ మేచ్‌ల గురించి చెప్పుకున్నట్టు, మనకి అవసరం లేనప్పుడో ఇష్టంలేప్పుడో ఒక అభిప్రాయం, తర్వాత మనవాళ్ళెవరైనా అమెరికాలో వృద్ధిలోకి వస్తున్నప్పుడో, మనమే అమెరికా వచ్చేసినప్పుడో ఇంకో అభిప్రాయం ఏర్పరుచుకోవటంకూడా జరుగుతున్నట్టు చూస్తూనే వున్నాం.

అందని ద్రాక్షపళ్ళా? అందిన ద్రాక్షపళ్ళా?

నేను ఇండియాలో వున్నప్పుడు, జ్వరం వచ్చినప్పుడల్లా బ్రెడ్ పెడుతుండేవాళ్ళు. ఆరోజుల్లో అదో అలవాటు. (ఎప్పుడైనా బ్రెడ్ తినాలనిపిస్తే జ్వరం వచ్చిందని వంక కూడా పెట్టేవాళ్ళం. అది వేరే సంగతి) అమెరికా వచ్చాక, ప్రొద్దున్న ఏడింటికే ఆఫీసుకి వెడుతుంటే శ్రీమతి బ్రెడ్ మీద, స్ట్రా బెర్రీ జామ్ రాసి ఇచ్చేది.

"నాకేమన్నా జ్వరంవచ్చిందా బ్రెడ్ పెడుతున్నావ్?" అనేవాడిని. సంవత్సరాలు గడిచిన కొద్దీ, బ్రెడ్ మీద జామ్ ఒకటే కాదు, ఆవకాయ, గోంగూర పచ్చడీ, మిరప్పళ్ళ పచ్చడీ అన్నీ రుచిగా వుంటున్నాయి. బ్రహ్మాండంగా తింటున్నాను.

ఊహలు అపోహలయినట్టుగానే అపోహలు అసత్యాలు అవుతున్నాయి. ఒకనాటి దురభిప్రాయాలు, ఈనాడు సదభిప్రాయాలవుతున్నాయి. మనం అభిప్రాయాలు అవసరార్థం మార్చుకుంటున్నప్పుడల్లా సమర్థించుకోటానికి ఉదాహరణలూ కొల్లలుగా దొరుకుతూనే వున్నాయి.

మన జీవనసంగీతం మధురంగా వుండాలంటే ఈ ఊహాగానాలు అవసరమేమో కూడాను.

* * *